క్లుప్తంగా

'నాడు - నేడు' పనులకు శంకుస్థాపన



పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న భాస్కరరావు

గోపాలపట్నం: గోపాలపట్నం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాడు– నేడు పనులకు శుక్రవారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో వంటశాల, ఆర్చ్, గేటు, ఫ్లోరింగ్ వంటి వాటితో పాటు మైనర్ మరమ్మతులు పూర్తి చేయడానికి రూ. 22 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎల్లారావు, వైఎస్సార్ సీపీ 91, 92 వ వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, ఇంజినీరింగ్ కార్యదర్శి గాయత్రి, ఉపాధ్యాయులు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందిస్తున్న గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో ముస్లింలకు రంజాన్ తోఫాను ఎమ్మెల్యే గణబాబు అందజేశారు. రంజాన్ సందర్భంగా టీడీపీ నాయకుడు బొడ్డేటి విజయ్ కుమార్ సమకూర్చిన తోఫాను కొత్తపాలెం ప్రాంతానికి చెందిన సుమారు 100మంది ముస్లిమ్ కుటుంబాలకు గణబాబు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకట రమేష్,నాయకులు దాడి సురేష్, ఎం ప్రదీప్, బాబ్‌జాన్, రహమాన్, బత్తుల శ్రీను పాల్గొన్నారు.

సింహగిరిపై భారీ షెడ్డు నిర్మాణం



సింహగిరి మాడవీధుల్లో నిర్మించిన షెడ్డు

సింహాచలం: సింహగిరిపై నిర్మించిన భారీ షెడ్డు పూర్తయింది. సింహగిరి మాడ వీధుల్లో భక్తులకు నీడ కల్పించేందుకు 27 అడుగుల ఎత్తులో 25వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో లారస్ ల్యాబ్స్ సుమారు రెండు కోట్లతో భారీ షెడ్ నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. ఈమేరకు షెడ్డు నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. ఎండ వేడిమికి తట్టుకునేలా తెల్లని పైకప్పుతో భారీ షెడ్ నిర్మించారు. చందనోత్సవానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం షెడ్డు అందుబాటులోకి తీసుకురానున్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



సాహెబ్ కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న దొడ్డి కిరణ్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు నాగేంద్ర కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన షేక్ పీర్ సాహెబ్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా శుక్రవారం రూ.10 వేలను వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి కిరణ్ అందజేశారు. పీర్ సాహెబ్ కుటుంబానికి భరోసాగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష బీమా సొమ్ము మంజూరు చేసిందని, మిగిలిన నగదు బాధిత కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాకు బదిలీ అవుతుందని ఆయన తెలిపారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు అండగా జగనన్న

- వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌ను ఆశీర్వదించాలి
- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్



సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి పత్రం అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: అర్హత ఉంటే చాలు పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు తలుపుతడుతున్నాయని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. సంక్షేమ పథకాలతో ప్రతి ఇంట్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెలుగులు నింపారన్నారు. జీవీఎంసీ 61వ వార్డు పరిధిలోని గాంధీజీ వీధిలో శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపలో ఆదరణ లభించింది. సంక్షేమ పథకాలు తమకు భరోసా ఇచ్చాయని పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ సంక్షేమ పథకాల లబ్ధి వివరాలతో కూడిన బ్రోచర్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రతి ఒక్కరూ తలుపు బిగించుకొని జీవనం సాగించిన పరిస్థితిలో జగనన్న ప్రవేశపెట్టిన వలంటీర్లు ప్రాణాలను లెక్క చేయకుండా పింఛన్లు,ఇతర ప్రభుత్వ పథకాలు అందించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం హయాంలో ఇలాంటి పరిస్థితి ఉందా అని ప్రజల్ని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీ ప్రతినిధులు పింఛన్‌కు ఒక రేటు, స్కీవ ఇళ్లు ఇవ్వటానికి మరో రేటు పెట్టి వసూలు చేసేవారన్నారు. నేడు అర్హత ఉంటే పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ పథకాలు పొందుతున్నారని వివరించారు. ప్రభుత్వ పాలనను దృష్టిలో పెట్టుకొని వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌కు అంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్,61,62వ వార్డుల కార్పొరేటర్లు కొణతాల సుధ,బల్లా లక్ష్మణరావు,నాయకులు దాడి సత్యనారాయణ,నూకరెడ్డి,నరేష్,చట్టి నూకరాజుయాదవ్,మంగ,వరలక్ష్మి,సోనూ పాల్గొన్నారు.

ప్రజల్లోకి వెళ్లండి.. వారానికి ఒకసారైనా సచివాలయం పరిధిలోని నివాసాలకు వెళ్లి ప్రజలతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకోవాలని పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సచివాలయ అడ్మిన్‌కు సూచించారు.

కొడుకులా అండగా..



వయసు మళ్లిన నాకు కొడుకు మాదిరిగా ప్రతి నెలా వృద్ధాప్య పింఛన్ ఇస్తూ జగన్‌బాబు ఆదుకుంటున్నాడు. గత ప్రభుత్వంలో పింఛన్ కోసం రోజుల తరబడి ఎండలో ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేది. నేడు ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయం 6 గంటలకే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తోంది.

– రమణమ్మ, గాంధీజీవీధి

నా ఇంటిని జగనన్న నిలబెట్టాడు



రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మాకు ఇల్లు కట్టుకోలేని పరిస్థితి. ఇలాంటి మాకు ఇంటి నిర్మాణం కోసం జగనన్న సాయం చేశారు. అలాగే సున్నా వడ్డీ కింద ఆరు వేలు, ఆసరా పథకం కింద రూ.28 వేలు, జగనన్న విద్యా దీవెన కింద రూ.31 వేలు, అమ్మ ఒడి పథకం ద్వారా రూ. 29 వేలు నా జగనన్న ఇచ్చాడు. మా కుటుంబాన్ని నిలబెట్టాడు.

– ఈగలపాటి వాణి, రజకవీధి

మహిళా సాధికారతతో రాష్ట్ర ప్రగతి

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్



సమావేశానికి హాజరైన పొదుపు సంఘాల మహిళలు

మల్కాపురం: మహిళా సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి కీలకం అని నమ్మే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర సూక్ష్మ చిన్న మరియు మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 61,62వ వార్డు పరిధిలోని పొదుపు సంఘాల మహిళలు, ఆర్పీలతో శుక్రవారం మరిడిమాంబ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు వివిధ పథకాల ద్వారా సుమారు రూ. 2.44 లక్షల కోట్లు జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని చెప్పారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రుణాలు ఇవ్వడమే కాకుండా వారికి కుట్టు శిక్షణ, సూక్ష్మ పరిశ్రమల స్థాపన కోసం సాయం అందిస్తున్నారన్నారు. అటువంటి వ్యక్తిని మరలా మనమంత రెండో సారి ముఖ్యమంత్రి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమం అనంతరం ఆసరా చెక్‌ను లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్పొరేటర్లు పి.వి.సురేష్,బల్లా లక్ష్మణరావు, కొణతాల సుధ,గుండపు నాగేశ్వరరావు, నాయకులు దాడి సత్యనారాయణ,నూకరెడ్డి,భోగవల్లి నాగభూషణం, బూస అప్పలరెడ్డి,శంకరరావు,తోనంగి వెంకటరమణియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భయం వీడితే విజయం మనదే

- వ్యక్తిత్వ నిపుణుడు సుధీర్



మాట్లాడుతున్న సుధీర్

గోపాలపట్నం: భయం వీడితే విజయం వరిస్తుందని వ్యక్తిత్వ వికాస నిపుణుడు సుధీర్ అన్నారు. బెహరా కళాశాలలో శుక్రవారం వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. కార్యక్రమాన్ని విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ బెహరా విజయచైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో మనో ధైర్యాన్ని నింపేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇక్కడి విద్యార్థులు సృజనాత్మకతతో బయటకు వెళ్తారని చెప్పారు. సుధీర్ మాట్లాడుతూ పరీక్షలు సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురకావద్దని సూచించారు. ప్రణాళికాబద్ధంగా చదివితే నిరాశ దరి చేరదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్లు సుకన్య, లీలాప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబజార్ల అభివృద్ధికి కార్యాచరణ

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ



వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న చైర్మన్ బీఎస్ కృష్ణ తదితరులు

గోపాలపట్నం: రైతు బజార్ల అభివృద్ధి, ఆదాయ లక్ష్యాల సాధనకు తగిన ప్రణాళికలు చేస్తున్నామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ అన్నారు. గోపాలపట్నంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం సాధారణ సమావేశం నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ ఫీజు రూ. 220లక్షల వసూలు చేయాలన్న లక్ష్యాన్ని చేరుకున్నట్టు చెప్పారు. లక్ష్యాలు చేరుకోవడానికి సహకరించిన సిబ్బందిని అభినందించారు. అలాగే 2023–24 సంవత్సర బడ్జెట్‌ను సమావేశంలో ఆమోదించారు. రైతు బజార్ల నిర్వహణ, రైతుల, వినియోగదారుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యువతారెడ్డి, పాలక వర్గ సభ్యులు ఎస్. సన్యాసిరావు, టి.రమణమ్మ, టి. ప్రసూణ, సీహెచ్ వరలక్ష్మి, మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ పి. పాపారావు, మార్కెటింగ్ అధికారి ఎస్కే యాసిన్ పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

మల్కాపురం: అతివేగంగా వచ్చిన ఓ కారు.. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టింది. శుక్రవారం జరిగిన ఈ ఘటనలో ఆ ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా.. 58వ వార్డు పిలకవానిపాలెం వైఎస్సార్ విగ్రహం సర్కిల్ వద్ద రహదారిలో రాజు తన మిత్రుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ఓ కారు అక్కడి మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో టూ వీలర్ ముందు భాగం నుజ్జయింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న రాజు తలకు గాయమైంది. వెనుక ఉన్న రాజు మిత్రుడికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులకు సపర్యలు చేసి, అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. కారులో ఉన్న యువకులు స్థానికేతురులని, వారి ప్రవర్తించిన తీరును చూస్తే గంజాయి తాగి వాహనం నడిపి ఉండొచ్చని పలువురు స్థానికులు తెలియజేశారు.

పుస్తక రివ్యూ పోటీల్లో గురుకుల విద్యార్థి ప్రతిభ



వెంకట భవానికి ప్రశంసాపత్రం అందిస్తున్న సంజీవరావు, రూపవతి

గోపాలపట్నం: మేహాద్రి గెడ్డలోని గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని బి. వెంకటభవాని ప్రతిభ చాటింది. ఇటీవల మానవ కంప్యూటర్ శకుంతలాదేవి జయంతి సందర్భంగా విశాఖ జిల్లా డీసీవో కార్యాలయంలో గురుకుల పాఠశాలల అకడమిక్ మానిటరింగ్ అధికారి ఆధ్వర్యంలో ×సంకెళ్లను తెంచుకుంటూ× అనే పుస్తకానికి రివ్యూ రాసే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మేహాద్రి గెడ్డ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి బి. వెంకట భవాని ప్రథమ బహుమతి సాధించింది. ఈ మేరకు అనకాపల్లి జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయ కర్త ఎస్. రూపవతి, గురుకుల పాఠశాల అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎస్. సంజీవరావు చేతుల మీదుగా బహుమతి అందుకుంది. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ మృదుల ప్రియదర్శిని, ఉపాధ్యాయులు వెంకట భవానిని అభినందించారు.

పోలీసుల అదుపులో ఈవ్‌టీజర్

ఆరిలోవ: ఓ యువతిపై ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతూ సీపీ కంట పడిన యువకుడ్ని ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ శుక్రవారం ఉదయం రుషికొండ వైపు బీచ్ రోడ్డులో పోలీసు వాహనంలో వెళ్తున్నారు. అదే సమయంలో జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ మధ్యలో ఓ యువతిని యువకుడు ఈవ్ టీజింగ్ చేస్తుండగా సీపీ గమనించారు. వారి దగ్గరకు వెళ్లేసరికి ఆ యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయాడు. ఆ వాహనం నంబరు గుర్తుపెట్టుకున్న సీపీ అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు పీఎం పాలెం వద్ద ఆ నంబరు గల వాహనాన్ని పట్టుకొని ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో సంఘటన జరగడంతో ఆ యువకుడిని పీఎం పాలెం పోలీసులు ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. ఇదిలా ఉండగా ఈవ్ టీజింగ్‌కు గురైన యువతి నుంచి పోలీసులుకు ఫిర్యాదు అందలేదు. ప్రస్తుతం ఆ యువకుడు అదుపులో ఉన్నట్లు ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిపారు.

రైళ్ల దారి మళ్లింపు, రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్, గన్నవరం–ముస్తాబాద–గుణదల సెక్షన్ పరిధిలో జరుగుతున్న ఆధునీకీకరణ పనుల నిమిత్తం ఆ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. కింద పేర్కొన్న రైళ్లు ఆయా తేదీల్లో రెగ్యులర్ మార్గం నిడదవోలు–ఏలూరు–విజయవాడల మీదుగా కాకుండా వయా నిడదవోలు–భీమవరం టౌన్– గుడివాడ–విజయవాడల మీదుగా నడుస్తాయి. ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖలో బయలుదేరే విశాఖపట్నం–గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్..

- ఈ నెల 21న ధన్‌బాద్‌లో బయలుదేరిన ధన్‌బాద్–అలెప్పి(13351) బొకారో ఎక్స్‌ప్రెస్..
- ఈ నెల 21న టాటానగర్‌లో బయలుదేరే టాటానగర్–బెంగళూరు(12889) ఎక్స్‌ప్రెస్..
- ఈ నెల 22న హతియాలో బయలుదేరే హతియా–బెంగళూరు(18637) ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించిన మార్గంలో నడుస్తాయి.

రీషెడ్యూల్, గమ్యం కుదించిన రైళ్ల వివరాలు.. సంబల్‌పూర్ డివిజనల్ టిట్లాఘడ్–తెరుబలి, టిట్లాఘడ్–లఖోలి సెక్షన్‌ల పరిధిలో జరుగుతున్న బ్రిడ్జి పునర్నిర్మాణ పనుల నిమిత్తం వాల్తేర్ డివిజన్, రాయగడ–విజయనగరం పరిధిలో నిర్వహిస్తున్న భద్రతా పనుల నిమిత్తం పలు రైళ్లు రీషెడ్యూల్ చేస్తున్నట్లు ఎ.కె.త్రిపాఠి చెప్పారు. ప్రయాణికులు మార్పులను గమనించి సహకరించాల్సిందిగా కోరారు.

- ఈ నెల 22న హజ్రత్ నిజాముద్దీన్‌లో హజ్రత్ నిజాముద్దీన్ – విశాఖపట్నం(12808) సమతా ఎక్స్‌ప్రెస్ 5 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.
- ఈ నెల 22న నాందేడ్‌లో నాందేడ్ – సంబల్‌పూర్ (20810) ఎక్స్‌ప్రెస్ నాలుగున్నర గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.
- ఈ నెల 22న గుంటూరులో బయలుదేరే గుంటూరు–రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 23న రాయగడ–గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్ రాయగడ నుంచి కాకుండా విజయనగరం నుంచి బయలుదేరుతుంది.

స్ఫూర్తి నింపే సివిల్ సర్వీసెస్ డే



ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట : ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి, వారిలో స్ఫూర్తి నింపేందుకే జాతీయ సివిల్ సర్వీసెస్ రోజును ప్రతి ఏడాది ఏప్రిల్ 21వ తేదీన జరుపుకుంటున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 16వ జాతీయ సివిల్ సర్వీసెస్ రోజును ఘనంగా నిర్వహించారు. దేశంలోని వివిధ పబ్లిక్ సర్వీస్ విభాగాల్లో నిమగ్నమై ఉన్న అధికారుల పనిని గుర్తించేందుకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 21న దీనిని పాటిస్తారన్నారు. అనంతరం 16వ జాతీయ సివిల్ సర్వీసెస్ రోజు సందర్భంగా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగుల చేత జాయింట్ కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ. 2.89 కోట్లు

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డులో పలు అభివృద్ధి పనులకు రూ.2.89కోట్ల మంజూరుకు జీవీఎంసీ స్థాయి సంఘం ఆమోదం తెలిపిందని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తెలిపారు. వార్డు అభివృద్ధికి సహకరించిన కార్పొరేటర్లు, అధికారులు, స్థాయీ సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పనులు చేపట్టడానికి టెండర్‌కు ఆమోదం లభించిందని చెప్పారు. 52వ వార్డును మోడల్ వార్డుగా తీర్చి దిద్దుతానని తెలిపారు. శుక్రవారం ఆయన పలు ప్రాంతాల్లో చేపట్టనున్న పనులు.. మంజూరైన నిధుల వివరాలు వెల్లడించారు.

- మర్రిపాలెం వుడాలేఅవుట్, శాంతినగర్, అంబేడ్కర్‌నగర్, కరాసాలో సుమారు 1100 మీటర్ల మేర భూగర్భ మురుగు నీటి పైప్‌లైన్ పొడిగింపు పనులకు రూ.49.50 లక్షలు.
- క్రిస్టియన్ శ్మశాన వాటికలో ఉన్న మేజర్ డ్రైన్ నిర్మాణానికి రూ. 36.50లక్షలు, మర్రిపాలెం వుడాలేఅవుట్ బీటీ రోడ్డుకు రూ.38లక్షలు.
- మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని నవ్యాంధ్ర పాఠశాల వద్ద గ్రీన్ బెల్టు ఆధునికీకరణకు రూ.48.50లక్షలు.
- మర్రిపాలెం వుడాలేఅవుట్ వద్ద ప్రధాన గెడ్డ అభివృద్ధికి రూ.39లక్షలు.
- కరాసా హిందూ శ్మశాన వాటికలో ప్రధాన కాల్వ అభివృద్ధికి రూ.38లక్షలు.
- మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని నిమిష్ అపార్ట్‌మెంట్ వద్ద గెడ్డ అభివృద్ధికి రూ.40 లక్షలు మంజూరయ్యాయి.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

- జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు



ఆర్‌పీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ఆర్‌పీలకు జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు సూచించారు. జీవీఎంసీ 91, 92 వార్డుల పరిధిలో కమ్యూనిటీ ఆర్గనైజర్లుగా నూతనంగా నియమితులైవారిని పరిచయం చేశారు. ఈ సందర్భంగా గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలు ప్రజల వద్దకు తీసుకు వెళ్లేందుకు ఆర్‌పీలు దోహదపడాలన్నారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వ చేస్తున్న కృషిని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో 91, 92వ వార్డుల వైఎసార్ సీపీ అధ్యక్షులు అప్పలస్వామి, గుణిశెట్టి శ్రీనివాసరావు, 91వ వార్డు సీవో ఝాన్సీ, 92వ వార్డు సీవో సబల కుమారి, గొంతిన నాగరాజు కంపర సత్తిబాబు, కంచర కోటేశ్వరరావు, చుక్క పైడిరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆర్టీసీ ఉద్యోగుల వినతి



గోపాలపట్నం తహసీల్దార్ జయకు వినతిపత్రం అందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

గోపాలపట్నం: గోపాలపట్నం తహసీల్దార్ కొర్ర జయకు శుక్రవారం సింహాచలం ఆర్టీసీ డిపో పరిధి నేషల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యులు తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. డిపో కార్యదర్శి జేఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేసినప్పటికీ అధికారుల నుంచి పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని వాపోయారు. విలీనం తరువాత ఉద్యోగులతో గాని, ఉద్యోగ సంఘాలతో గాని చర్చించలేదన్నారు. అధికారులు తమకు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విశాఖ రాజధాని నిర్ణయానికి తగిన విధంగా బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. ఉద్యోగులకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఇంక్రిమెంట్ల విషయంలో, ఓటీ, అలవెన్స్, నైట్‌అవుట్‌లు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని తెలిపారు. సింహాచలం దేవస్థానానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటోందని, దానికి అనుగుణంగా బస్సులు పెంచాలని సూచించారు. తమ సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తహసీల్దార్‌ను కోరారు. అసోసియేషన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో ఘనంగా ఇఫ్తార్ విందు



ముస్లిం పెద్దలను సత్కరిస్తున్న సాయి మందిరం ప్రతినిధులు

అగనంపూడి: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా అగనంపూడి సాయిబాబా ఆలయంలో శుక్రవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మసీద్ ఈ అబూబర్ అధ్యక్షుడు మీరా మొహిద్దీన్ మాట్లాడుతూ మతాల ప్రమేయం లేకుండా హిందూ, ముస్లింలు సఖ్యతతో సోదర భావంతో మెలుగుతూ దేశ సమగ్రతను కాపాడుకుంటున్నామన్నారు. సాయి మందిర కమిటీ ప్రతీ ఏటా ఇఫ్తార్ విందు ఏర్పాటు సంప్రదాయంగా కొనసాగడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మీరా మొహిద్దీన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కె.వి.రమణారెడ్డి, నాయకులు బి.సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు డి.వ్యాసశర్మ, జి.శంభుడు, పి.సత్యనారాయణ, సత్యవతి, లీలావతి, పంకజం తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో పాల్గొన్న అభ్యర్థులు

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి(క్లరికల్) సిహెచ్.సుబ్బిరెడ్డి మాట్లాడుతూ అరబిందో ఫార్మా, దక్కన్ ఫైన్ కెమికల్స్, అపోలో ఫార్మా, నవత రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్, జయభేరి ఆటో మొబైల్స్, సుగుణ ఫూడ్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 723 ఖాళీల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించగా.. 234 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి ఉమాదేవి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేశారు. సుమారు 142 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు సుబ్బిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి(టెక్నికల్) కె.సుధా, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'మా నమ్మకం నువ్వే జగన్'



ప్రజలు ఆమోదించిన పత్రాలను ఆనంద్‌కుమార్‌కు అందజేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: నాలుగేళ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్తూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం 40వ వార్డులో దిగ్విజయంగా పూర్తయింది. ఈ మేరకు జీవీఎంసీ 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రజలు ఆమోదించిన పత్రాలను శుక్రవారం పశ్చిమ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు అందజేశారు. ప్రజలు మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డినే కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్ సచివాలయ పరిధిలోని పలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ప్రజలతో మమేకమై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.